మే - జూన్, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



ఈ కుమ్మరి మంటికి చేసినట్లు నేను మీకు చేయలేనా?
ఇదే యెహోవా వాక్కు



# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

దేవుని నామములో స్పర్శ పాఠకులకు నా శుభములు. తండ్రియైన దేవుడు తన పూర్ణ సమాధానముతో మిమ్ములను నడిపించును గాక! విద్యార్థులకు చదువులలో సరియైన కోర్సులు తీసుకోవడానికి కావలసిన జ్ఞానము దేవుడు అనుగ్రహించునట్లుగా ప్రార్థన చేద్దాము. పిల్లలకి ఎగ్జామ్స్ అయిపోయి, సెలవులకు ఆయా స్థలములకు వెళ్తున్నవారు ఎంతో బాధ్యతతో మెలగవలసి ఉన్నది. మనలను చూచినవారు దేవునిని మహిమపరిచే విధముగా మన మాటలు, జీవిత విధానము ఉండవలసిన అవసరత ఉన్నది. చీకటి లోకములో మనము వెలిగే నక్షత్రముల వంటి వారము. మనము వ్యక్తిగతంగా ఎంత అభివృద్ధి చెందాము అనే దాని కంటే మన జీవితము ద్వారా ఎంతమంది ప్రభావితమై, దేవునిని మహిమపరచుచున్నారు అనేది ముఖ్యము.

మనలను మనము పరీక్షించుకొనుట అనేది క్రైస్తవ విశ్వాస జీవితములో ఎంతో ప్రాముఖ్యమైనది. అందుకే అపో. పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో మనలను మనమే విమర్శించుకుంటే తీర్పు పొందక పోదుము (11:31). మనలను మనమే విమర్శించుకొనుటకు ప్రతిదినము కొంత సమయము కేటాయించిన యెడల అది మనకి ఎంతో మేలు. మనలను మనము విమర్శించుకొనుట ద్వారా అనేక విషయములలో జయము పొందడానికి అవకాశం ఉంటుంది. ఇతరులను విమర్శించే సమయమును మనలను విమర్శించుకొనుటకు ఉపయోగించిన యెడల మన కంటే మేలు పొందేవారు ఎవరూ ఉండరు.

అలాంటి కృపతో దేవుడు మనలను నడిపించును గాక!

మీ సహోదరుడు.....



మే - జూన్, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- నా చేతిలో ........ 2
- ఓ (గుణ) పాఠము ........ 5
- ఉత్తమమైనది ఏది? (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- సీతాకోక చిలుక ఇచ్చే సందేశము ........ 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 16వ భాగము ........ 11
- జిమ్మి త్యాగము (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
- రూపాయి, యూరో, డాలర్, పౌండ్ ........ 17
- ఇది మీకు తెలుసా? ........ 18
- అయ్యో ప్రేమ ........ 19
- తాబోరు కొండ ........ 21
- బైబిల్ క్విజ్-16 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# నా చేతిలో

**- బ్రదర్. ఎపఫ్రా**

**ఇశ్రాయేలు వారలారా, ఈ కుమ్మరి మంటికి చేసినట్లు నేను మీకు చేయలేనా? ఇదే యెహోవా వాక్కు - జిగటమన్ను కుమ్మరి చేతిలో ఉన్నట్టుగా ఇశ్రాయేలు వారలారా, మీరు నా చేతిలో ఉన్నారు** (యిర్మీయా 18:6)



ఒక రోజు దేవుడు యిర్మియాకి కనిపించి, నీవు లేచి కుమ్మరి ఇంటికి వెళ్ళు అని చెప్పడం జరిగింది. దేవుడు చెప్పిన విధంగా అక్కడికి వెళ్ళేసరికి అతడు తన సారె మీద కుండని తయారు చేస్తూ కనిపించాడు. అతని చేతిలో ఉన్న జిగటమన్ను మధ్యలో విరిగిపోయినప్పుడు ఆ కుమ్మరి మరల దానిని తీసుకొని, తనకు నచ్చిన విధంగా ఒక పాత్రను తయారు చేశాడు. దేవుడు యిర్మియాతో కుమ్మరి చేతిలో మట్టి ఎలా ఉందో నా చేతిలో ఈ ప్రజలు అలా ఉన్నారు అని వివరించడం జరిగింది. విరిగిపోయిన వెంటనే కుమ్మరి ఆ జిగట మన్నును పారవేయ లేదు కానీ మరల ప్రయత్నించి తాను ఉద్దేశించిన రూపము లోనికి మరల్చడం జరిగింది. దేవుడు మన విషయములో కూడా ఇదే విధానమును అవలంబిస్తాడు. అయితే ఇక్కడ గమనించవలసిన విషయం కుమ్మరి మనస్సులో ఉన్న శ్రద్ధంతా తన చేతితో మంచి పాత్రలను సిద్ధపరచాలనే కానీ, వేరొకటి కాదు. ఎన్నిసార్లు ఆ మన్ను విరిగిపోయినా దాని తిరిగి మరల తాను కోరుకున్న రూపములోనికి తీసుకు రావడానికి శ్రమిస్తూ ఉంటాడు. దేవుడు మానవుల మైన మనలను కూడా ఆయన కోరుకున్న పాత్రలుగా సిద్ధపరు స్తున్నప్పుడు, మనము అనేకసార్లు తప్పిపోయిననూ, ఎదురు తిరిగిననూ ఆయన ప్రయత్నిస్తూనే ఉంటాడు.

మనలో కొందరు మేము పనికిరాని వారమని, జీవితమంతా వ్యర్థమై పోయిందని, బ్రదుకుట కంటే చనిపోవుట మేలని కృంగి నిరాశ చెందుతూ ఉంటారు. కానీ దేవుడు చెప్పిన వాక్యము వైపు చూస్తే ఎంత నిరాశలో ఉన్నవారికైనా నిరీక్షణ కలుగుతుంది. నీవు ఎన్నిసార్లు

తప్పిపోయినప్పటికి, తప్పిపోయిన పరిస్థితులను గురించి పశ్చాత్తాపపడితే, **మీ పాపములు రక్తము వలె ఎఱ్ఱనివైనను అవి హిమము వలె తెల్లబడును, కెంపు వలె ఎఱ్ఱనివైనను అవి గొఱ్ఱెబొచ్చువలె తెల్లని వగును (యెషయా 1:18)** అని చెప్పిన దేవుని మాటని బట్టి నూతనపరచబడడం జరుగుతుంది.

యేసుక్రీస్తు శరీరధారిగా భూమి మీద ఉన్న దినములలో పేతురు అనే శిష్యుని గురించి లూకా 22:31వ వచనములో **"సీమోనూ, సీమోనూ ఇదిగో సాతాను మిమ్మును పట్టి గోధుమల వలె జల్లించు టకు మిమ్మును కోరుకొనెను"** అని చెప్పెను, 34వ వచనములో **"ఆయన పేతురూ, నీవు నన్నెరు గనని ముమ్మారు చెప్పు వరకు నేడు కోడి కూయదని నీతో చెప్పుచున్నా ననెను".** అందుకు పేతురు నేను అబద్దమాడను అని గట్టిగా చెప్పడం జరిగింది. అవస రమైతే నీ కోసం చని పోతాను అనే తీర్మానం కూడా చేశాడు. కొన్ని దినములు జరిగేసరికి అర్ధరాత్రి యేసుక్రీస్తుని పట్టు కొని సైనికులు ఈడ్చుకొని పోతూ ఉండగా, ప్రభువు చెప్పి నట్లు గానే పేతురు ఆ రాత్రి యేసు ఎవరో తెలియదని ముమ్మారు అబద్ధం చెప్పడం జరిగింది. వెంటనే కోడి కూసింది, ప్రభువు ముందు గానే చెప్పిన మాటలని జ్ఞాపకం చేసుకొని పేతురు ఎంతో దుఃఖిం చాడు.



నేను ఊహించినట్లుగా జీవితములో జరగలేదని, దేవుడు కోరుకున్నట్లుగా బ్రతుక లేకపోయానని, ఎన్నో ప్రసంగ ములు విన్నాను, అనేక తీర్మాన ములు చేసుకున్నాను కానీ నేను వాటిని పాటించ లేకపోయాను. ఇంక నేను పనికిరాను, ఏ మాత్రం దేవుడు నన్ను క్షమించరని లేని పోని అపోహలతో బ్రదుకుతున్నావా? అయితే పేతురుని చూడు! ఏ బోధకుడు బోధించలేని అద్భుతమైన బోధలు యేసు నోట విన్నప్పటికి, ఆయనతో పాటుగా కలిసి జీవించినప్పటికి ఒకానొక సమయములో ఆయన ఎవరో తెలియదని ముమ్మారు గట్టిగా చెప్పి చాలా పెద్ద తప్పు చేశాడు. అయినప్పటికి ప్రభువు పేతురు జీవితములో కలిగిన

అపజయమును కూడా శిక్షణలో భాగంగానే తలంచాడు. పేతురులోని నేను అనే అహంభావం చనిపోయి, నా వల్ల ఏమీ కాదు, అనే స్థితికి చేరుకున్నాడు. మన ఉద్రేక పూరితమైన సొంతభావం, స్వంతజ్ఞానం అన్నీ సున్నా అయినప్పుడే దేవుడు తన ఉద్దేశ్యమును మన జీవితములో నెరవేర్చుకుంటారు.

ఆ తరువాత దినములలో పేతురు జీవితమును దేవుడు ఎంత బలంగా వాడుకున్నారో చూస్తే, మూడు సార్లు ఆయన ఎవరో తెలియదు అని అబద్ధమాడిన వ్యక్తేనా ఇతను అని ఆశ్చర్యం కలగక మానదు.

ప్రియ సహోదరి! సహోదరుడా! కుమ్మరి చేతిలో మన్ను ఎలా అయితే ఉందో దేవుని చేతిలో నీవు కూడా అలాగే ఉన్నావని విశ్వసిస్తే, నీ జీవితంలో దేవుడు గొప్ప అద్భుతం జరిగిస్తాడు. కుమ్మరి చేతిలో మన్ను విడిపోయినట్లుగా నీవు ఎన్నిసార్లు దేవుడు చేసిన ప్రయత్నములలో తప్పిపోయినా, నీ కోసం మరియొక అవకాశం సిద్ధంగానే ఉన్నది. కనుక బ్రదుకు దినములన్నిటిలో నిరీక్షణ అనేది కోల్పోవద్దు.

**“నీవు ఆయన చేతిలో ఉన్నావు, ఆయన నిన్ను తప్పక ప్రయోజనకరమైన పాత్రగా సిద్ధపరుస్తాడు”**

అట్టి ధన్యత దేవుడు నీకు దయచేయును గాక !

## ఇది మీకు తెలుసా?

**క్రొత్త నిబంధన పాత నిబంధన కంటె ఎంతో గొప్పది.**

**“ఈయన మరియెక్కువైన నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు” (హెబ్రీ 8:6)**

అనేక మంది క్రైస్తవులకు పాత నిబంధనకు మరియు క్రొత్త నిబంధనకు మధ్య ఒక ప్రధానమైన వ్యత్యాసముందని తెలియదు.

పాత నిబంధన ఒక వ్యక్తి యొక్క బాహ్య జీవితమును శిక్ష యొక్క భయము చేత కాని లేక ప్రతిఫలము యొక్క వాగ్దానము చేత గాని శుద్ధిపరచును. అయితే క్రొత్త నిబంధన ప్రేమ కలిగిన స్వభావమైన యేసు క్రీస్తు స్వభావాన్ని పరిశుద్ధాత్ముడు మనకిచ్చుట ద్వారా మనలను మార్చును.

పందిని గొలుసులతో బంధించి శుభ్రముగా ఉంచవచ్చును.ఒక పిల్లి తన స్వభావ సిద్ధముగా శుభ్రముగా నుండును. ఈ ఉదాహరణ రెండు నిబంధనల మధ్యనున్న వ్యత్యాసాన్ని తెలుపును.

# ఓ [గుణ] పాఠము

30 సంవత్సరముల తరువాత నలుగురు ప్రాణ స్నేహితులు ఒక ఫంక్షన్‌లో ఒకరినొకరు కలుసుకున్నారు. నలుగురూ ఒకచోట కూర్చుని డిన్నర్‌ని ముగించారు. వారిలో ఒక వ్యక్తి కొంచెము సమయము విశ్రాంతి తీసుకోవడానికి రెస్ట్‌రూమ్‌కి వెళ్ళాడు. మిగిలిన వారు వాళ్ళ పిల్లల గురించి మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. మొదటిగా ఒక వ్యక్తి "నా కొడుకుని చూచి, నేనెంతో గర్వపడతాను, వాడు ఒక కార్పొరేట్ కంపెనీలో ఎంతో కష్టపడి పైకి వచ్చాడు. ఎం.బి.ఎ చదివిన తరువాత ఆ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, ఇప్పుడు ఆ కంపెనీకే ప్రెసిడెంట్ అయ్యాడు చాలా ధనవంతుడయ్యాడు. ఎంతగా అంటే వాడి బెస్ట్‌ఫ్రెండ్‌కి మెర్సిడెస్ బెంజ్ కారుని బర్త్‌డే గిఫ్ట్‌గా ఇచ్చాడు.

**రెండవ వ్యక్తి –** ఓహ్! ఆశ్చర్యం! నా కొడుకు కూడా చాలా గ్రేట్, వాడు ఎయిర్‌లైన్స్ కంపెనీలో పని చేయడం ప్రారంభించిన కొంత కాలానికే ఆ కంపెనీ పార్టనర్ అయ్యాడు. ఎక్కువ వాటాని చేజిక్కించుకున్నాడు. ఎంతగా ధనవంతుడయ్యాడంటే వాడి ఫ్రెండ్ బర్త్‌డేకి క్రొత్త విమానమును బహుమానంగా ఇచ్చాడు.

**మూడవ వ్యక్తి –** వెల్, నా కొడుకు మంచి యూనివర్శిటీలో ఇంజనీరింగ్ చదివాడు. తరువాత ఒక కన్‌స్ట్రక్షన్ కంపెనీ స్టార్ట్ చేశాడు. ఇప్పుడు వాడు మల్టీ మిలియనీర్ (బహు ధనవంతుడు). వాడి స్నేహితుడి పుట్టినరోజుకి ఒక పెద్ద నగరములో కమర్షియల్ కాంప్లెక్స్ గిఫ్ట్‌గా ఇచ్చాడు.

ఆ ముగ్గురు స్నేహితులు ఒకరిని ఒకరు అభినందించుకొనుచుండగా, నాల్గవ వ్యక్తి విశ్రాంతి గది నుండి వస్తూ, ఎందుకు అభినందించుకుంటున్నారు? అని అడిగాడు

ఆ ముగ్గిరిలో ఒక వ్యక్తి మా పిల్లల గొప్పతనమును బట్టి అని చెప్పి, మరి మీ అబ్బాయి సంగతేంటి? అని అడిగాడు.

నాల్గవ వ్యక్తి "నా కొడుకు డ్యాన్స్ మాస్టర్‌గా నైట్ క్లబ్‌లో పని చేస్తాడు" అని చెప్పాడు

ఆ ముగ్గురు స్నేహితులు గట్టిగా నవ్వి, అయ్యో! ఎంత సిగ్గుచేటు, ఎంత అవమానం అన్నారు.

ఇంతలో నాల్గవ వ్యక్తి నేను మాత్రం సిగ్గుపడుట లేదు, వాడు నా కొడుకు, నేను వాడిని ఎంతో ప్రేమిస్తున్నాను, వాడేమీ అవమానకరమైన పనులేవి చేయుట లేదు. రెండు వారముల క్రితం వాడి పుట్టిన రోజు జరిగింది. వాడి ముగ్గురి స్నేహితులు ఒక కమర్షియల్ కాంప్లెక్స్, క్రొత్త విమానం మరియు మెర్సిడెస్ బెంజ్ కారు పుట్టిన రోజుకి గిఫ్ట్‌గా ఇచ్చారు !!!!!!!!

విషయమును లోతుగా అధ్యయనం చేయకుండా, మనం మాట్లాడే వారిగా, నిర్ణయములు తీసుకునే వారిగా ఉండకూడదు. ఆలోచించకుండా మాట్లాడితే అందరి ఎదుట నవ్వుల పాలవుతాము.

# ఉత్తమమైనది ఏది? - సిస్టర్ విజయ

**అనుదినము నా గడప యొద్ద కనిపెట్టుకొని**
**నా ద్వారబంధము యొద్ద కాచుకొని నా ఉపదేశము**
**వినువారు ధన్యులు** - సామె 8:34

దేవుని ఉపదేశమును గూర్చి జ్ఞానియైన మహారాజు సొలొమోను వ్రాసిన మాట. ఉపదేశము అనగా దేవుని వాక్యము. ఆది యందు వాక్యము ఉండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను అని యోహాను సువార్తలో చెప్పబడినట్లుగా వాక్యమే దేవుడై యుండెను గనుక వాక్యమును చదువుతూ, ధ్యానించుచూ దేవుని సన్నిధిలో గడుపుట ధన్యకరమైనది. ఎందుకనగా "నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగైయున్నది" అని మహారాజైన దావీదు చెప్పినట్లుగా మన పాదములను తొట్రిల్లనీయక, జారనీయక కాచి కాపాడేది ఆయన ఉపదేశము. ఆ ఉపదేశము కొరకు కనిపెట్టుకొని, వినుట మన జీవితములకు మంచిది.

బైబిల్ గ్రంథములో మరియ, మార్త అను ఇద్దరు సహోదరీలు, వారి సహోదరు డైన లాజరు బేతనియ గ్రామమునకు చెందినవారు. యేసుక్రీస్తు ఆ గ్రామములో ప్రవేశించినప్పుడు మార్త ఆయనను తన ఇంట చేర్చుకొనెను. చేర్చుకొని, విస్తారమైన పని పెట్టుకొనుట చేత తొందరపడి, ఆయన యొద్దకు వచ్చి - ప్రభువా, నేను ఒంటరిగా పనిచేయుటకు నా సహోదరి నన్ను విడిచి పెట్టినందున, నీకు చింత లేదా? నాకు సహాయము చేయుమని ఆమెతో చెప్పు మనెను. లూకా 10:40

ఇక్కడ మనము గమనించినప్పుడు మార్త కుటుంబమునకు పెద్ద, బాధ్యత కలిగిన స్త్రీగా కనబడుతుంది. అంతే కాక ప్రభువుని ప్రేమించి, ఆతిథ్యమిచ్చుట యందు ఎంతో ఆసక్తి కలిగినదిగా ఉంది. కాని పని చేయుటలో సణుగుకొంటూ ఉంది. ఇంటిలో చేర్చుకుంది కానీ విస్తారమైన పని పెట్టుకొని, కలిగిన ఒత్తిడి చేత ఏ విధంగా మాట్లాడాలో తెలియక తొందరపడి సహోదరి మీద ఫిర్యాదులు చేస్తుంది.

ఈ దినములలో అనేకులు యేసుప్రభువు మా దేవుడు కాడు, అని ఆయనను హృదయములలో చేర్చుకోవడానికి ఇష్టపడుట లేదు. **"యేసుక్రీస్తు అందరికి ప్రభువు"** అని పరిశుద్ధ గ్రంథమైన బైబిలు చెబుతుంది. కాబట్టి మొదటగా ఆయనను హృదయములో చేర్చుకోవాలి. ఆయనను హృదయములో చేర్చుకొనుట ద్వారా ప్రతి బలహీనతను ఎరిగి

సరిచేసుకొనుటకు ప్రభువు కృప చూపుతారు. ఆయనను చేర్చుకున్నాము, రక్షించబడ్డాము ఇంక చాలు అనే స్థితిలోనే ఆగిపోయి, విస్తారమైన పనుల ద్వారా కలిగే ఒత్తిడితోనే ఈ దినము అనేకులము జీవిస్తున్నాము. తద్వారా జీవితములో తొందరలు ఎక్కువై, ఎవరితో ఏ విధంగా మాట్లాడాలో ఆ విధంగా మాట్లాడక అధికమైన మాటలు మాట్లాడుచూ నష్టమును తెచ్చుకుంటాము. ఎదుటి వారిలోని లోపములను ఎత్తి చూపించే స్వభావము అలవడుతుంది. ఆయన పాదముల యొద్ద కనిపెట్టుకొని ఉపదేశమును వినుట ద్వారా తొందరపాటు తనము నుండి విడిపించబడతాము. ఆయన సన్నిధికి వెళ్ళి మనము నడవవలసిన త్రోవలను నేర్చుకొని విస్తారమైన పనుల ద్వారా కలిగే ఒత్తిడిని జయించడానికి ప్రయత్నించాలి కానీ ఆయన ఉపదేశమును నిర్లక్ష్యము చేయకూడదు.



మార్త యొక్క మాటలకు ప్రభువు – మార్తా, మార్తా నీవనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడు చున్నావు గాని అవసరమైనది ఒక్కటే! మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను. అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదని ఆమెతో చెప్పెను. (లూకా 10:41,42) ఎంత శ్రేష్ఠమైన సందేశమును ప్రభువు చెప్పారో చూడండి. మార్త ప్రభువుని గృహములోనికి చేర్చుకోవ డానికి ఆసక్తిని చూపింది కానీ అవసరమైనది ఏమిటో గ్రహించలేక పోయింది. మరియ మాత్రం అవసరమైనది ఏమిటో గ్రహించు కొని, ఆయన పాదముల యొద్ద కూర్చుని, మాటలు వింటూ నెమ్మది, ఆదరణ పొందు కొంది.మరియ తన జీవితమునకు అవసర మైనది గ్రహించుకొని, ఉత్తమమైనది ఏర్ప రచుకున్నది.

ఈ దినమున ఎంతమంది మరియవలె ఆయన పాదముల యొద్ద కనిపెట్టుకొని, ఉపదేశముల కొరకు ఎదురు చూస్తున్నారు. రక్షించబడిన తరువాత సంఘములోని పనుల కొరకు, గుర్తింపు కొరకు ఉన్న ఆశ, తపన ఆయన సన్నిధిలో గడపడానికి ఉపదేశమునకు చెవియొగ్గడానికి లేదు అని చెప్పుటలో నిజం ఉంది. వారేనా చేసేది, మేము చేయలేమా?

అని సణుగుకోకుండా ఉన్న స్త్రీలు ఎంత మంది ఉన్నారు? ఏది ఉన్నా, లేకపోయిననూ నాకు అవసరమైనది ఒక్కటే, ఉత్తమమైన ఆయన పాద సన్నిధిని ఏర్పరచుకొని, ప్రార్థిస్తాను అనే నిర్ణయం కలిగిన స్త్రీలు ఉండుట కుటుంబమునకు, సంఘమునకు, సమాజమునకు ఎంతో మేలైన విషయం. ఏ పనులు ఇచ్చిననూ అవి శాశ్వతం కాదు, ఒక దినమున తీసివేయబడవచ్చు కానీ ఉత్తమమైన ఆయన పాద సన్నిధి మాత్రం మన యొద్ద నుండి తీసివేయబడదు.

ప్రభువు చెప్పిన మాటలను బట్టి మార్త అవసరమైనది గ్రహించుకొని ఆయన మాటలను ధ్యానిస్తూ, లోకమునకు రావలసిన దేవుని కుమారుడైన క్రీస్తు ఆయనే నన్న ఆత్మీయ సత్యమును గ్రహించుకొన్న స్త్రీగా ఉంది. మరియ ప్రభువు పాదములను అత్తరుతో కడిగి తలవెంట్రుకలతో తుడిచిన స్త్రీగా చరిత్రలో నిలిచింది. ప్రభువుతో ఈ సహోదరీలకు ఉన్న సన్నిహిత సంబంధము చనిపోయి, నాలుగు దినములుగా సమాధిలో ఉంచబడిన లాజరుని తిరిగి సజీవుడిగా పొందుకునేటట్లు చేసింది.

కాబట్టి ప్రియమైన వారలారా ! మార్త వలె విస్తారమైన పనులతో తొందరపాటు స్వభావమును కలిగి, ఎదుటి వారిని కోపగించుకొనక, మరియ వలె జీవితమునకు అవసరమైనది ఆయన పాద సన్నిధి, అది ఎప్పటికి మన నుండి తీసివేయబడనిది అని గ్రహించి, ఉపదేశమును వినటానికి, ఉపదేశానుసారముగా జీవించడానికి ఇష్టపడి, మార్పుని కోరుకునే స్త్రీల వలె దేవునితో సన్నిహితంగా ఉండునట్లుగా ముందుకి సాగిపోదాము.

అట్టి ధన్యత దేవుడు మనకి దయచేయును గాక !

## ముఖ్య గమనిక

స్పర్శ ఆధ్యాత్మిక ద్వమాస పత్రిక రెన్యువల్ చేయించుకొనని వారు బాధ్యతతో రెన్యువల్ చేయించుకొనగలరని మనవి.

# సీతాకోక చిలుక ఇచ్చే సందేశము

అనగనగా ఒక రోజు గొంగళిపురుగు నుండి సీతాకోకచిలుక ఏర్పడడానికి, గొంగళిపురుగు శరీరం ఉన్న కాయలో (cocoon) ఒక రంధ్రం ఏర్పడింది. ఒక మనుష్యుడు దానిని చూచి కొన్ని గంటలు పరిశీలించడం జరిగింది. ఆ రంధ్రములో నుండి ఒక సీతాకోకచిలుక బయటకు రావడానికి పోరాడుతోంది. దానిని చూచి, ఆ మనుష్యుడు సహాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. చిన్న కత్తెరను తీసుకొని, ఆ రంధ్రం రెండు ప్రక్కలా దానిని కత్తిరించడం జరిగింది. అప్పుడు తేలికగా సీతాకోకచిలుక బయటకు వచ్చింది.

కానీ అది బలహీనమైన శరీరము మరియు ముడుచుకు పోయిన చిన్న రెక్కలను కలిగి ఉన్నది. ఆ మనుష్యుడు ఏదో ఒక సమయములో సీతాకోకచిలుక రెక్కలు తెరుచుకుని, అవి పెద్దవై ఎగురుతుందని కనిపెడుతున్నాడు. కానీ అలా జరగలేదు. దాని జీవితమంతా కేవలం ప్రాకడం తప్ప, ఎన్నడూ ఎగరలేకపోయింది. ఆ తరువాత కూడా ఎటువంటి మార్పు లేదు. ఆ మనుష్యుడు చూపించిన దయ, మంచితనము ఆ సీతోకోకచిలుకను వైకల్యము లోనికి నెట్టివేసింది.

గొంగళిపురుగు శరీరములో నుండి సీతాకోకచిలుక పోరాటము ద్వారా ఒక రకమైన ద్రవపదార్ధము విడుదల చెంది, అవి రెక్కలుగా రూపాంతరము చెందుతాయి. అప్పుడు అది గొంగళిపురుగు దశ నుండి సీతాకోకచిలుకగా రూపాంతరము చెంది ఎగరడానికి సిద్ధపడుతుంది.

శ్రమలు మన జీవితమునకు ఎంతైనా అవసరము. ఏ ఆటంకములు లేకుండా, దేవుడు మన జీవితమును కొనసాగిస్తే మనము అవిటివారము. మనము ఉండవలసినంత స్థిరంగా, దృఢంగా ఉండలేము. అంతమాత్రమే కాక, ఏ మాత్రమూ ముందుకి దూసుకొని పోలేము.

**నేను శక్తిని ఇవ్వమని అడిగాను**

**దేవుడు కష్టములను తట్టుకునే బలముని ఇచ్చారు**

**నేను జ్ఞానము ఇవ్వమని అడిగాను**

**దేవుడు సమస్యలను పరిష్కరించే వాడిగా చేశాడు**

**నేను ఆశీర్వాదం ఇవ్వమని అడిగాను**

**దేవుడు జ్ఞానముతో కష్టపడుట నేర్పించాడు**

**నేను ధైర్యము కావాలని అడిగాను**

**దేవుడు ఆటంకములను దాటి పోవుట నేర్పించాడు**

**నేను ప్రేమను దయచేయమని అడిగాను**

**దేవుడు ఇబ్బందులు ఉన్నవారికి సహాయం చేయుట నేర్పించాడు**

**నేను అన్నీ అనుకూలముగా ఉండాలని అడిగాను**

**దేవుడు అవకాశములను కల్పించారు**

**నేను కోరుకున్నది ఏదీ నాకు దొరకలేదు**

**కానీ నాకు అవసరమైనవన్నీ నేను పొందుకున్నాను**

జీవితం భయం లేకుండా జీవించు, ఎన్ని ఆటంకములు ఎదురైనా వాటిని దాటుకుంటూ వెళ్ళగలనని నిశ్చయించుకో !



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 16వ భాగము**

అస్పృశ్యులైన వారికి ఈ రీతిగా నీళ్ళు ఇస్తుండేవారు. తనకి అలా చేయడాన్ని సుందర్ భరించలేక పోయాడు, ఒక్కసారిగా ఏడ్చేశాడు. చెంపలపై కన్నీరు కారుతుండగా తండ్రికి కృతజ్ఞతలు చెప్పి చెట్టు క్రింద నిద్రించాడు. తనకు కలిగిన బాధనంతా ఒక్కసారి గుర్తు చేసికొంటూ ఒకప్పుడు తననెంతగానో ప్రేమించిన తండ్రి తననిప్పుడు ద్వేషించడమును చూచినప్పటికిని సుందర్ హృదయంలోని ప్రశాంతత మాత్రం చెక్కుచెదరలేదు. తాను సిలువ వేయబడడానికి ముందు రాత్రి నా సమాధానమును మీకు అనుగ్రహించుచున్నానని యేసుప్రభువు తన శిష్యులకు చెప్పారు. ఆ సమాధానమును సుందర్‌కు కూడా దేవుడిచ్చాడు. ఏదియు ఆ సమాధానమును తీసివేయలేక పోయింది.

సుందర్ అంతకంతకు ప్రయాణిస్తూ తనకి అందుబాటులో ఉన్న వాటితోనే పరిశుభ్రంగా ఉండడం నేర్చుకున్నాడు. అనుదిన స్నానం, తలంటుకోవడం, బట్టలు ఉదుకుకోవడం ఇవన్నీ అంత సులువైన పనులు కావు. ఇతర సన్యాసుల వలె గాక ఎంతో పరిశుభ్రమైన బట్టలు ధరించేవాడు. తన బట్టలను ఉతికి శుభ్రపర్చుకొనేవాడు, కొన్నిసార్లు తడి బట్టలే ధరించవలసి వచ్చేది. అయితే ఎలాంటి అసౌకర్యములున్నప్పటికిని బాల్యం నుండి అలవర్చుకున్న పరిశుభ్రమైన అలవాట్లను పాటిస్తూనే యున్నాడు. తల్లి పెంపకంలో చిన్నవానిగా తానలవర్చుకొన్న విధంగానే ప్రాతఃకాలమునే కొద్ది గంటలు ప్రార్థన ధ్యానములలో గడిపి దినచర్యను ఆరంభించేవాడు సుందర్.

ముందు ముందు తనకు లభించబోయే ఆహారానికి అనుగుణంగా తన ఆహారపు అలవాట్లను కూడా సర్దుబాటు చేసుకున్నాడు.అవసరమైనపుడు తనకు దొరికే వాటిలోనే తాను జీర్ణించుకోగల పండ్లు, ఆకులు దుంపలతోనే ఆకలిని తీర్చుకోవడం అలవాటు చేసుకొన్నాడు. క్రీస్తు శిష్యునిగా మారిన ఈ యౌవనుడు తన సాధువు జీవితారంభంలోనే స్వాభావికమైన తన కోరికలను అదుపులోనికి తెస్తూ ముందు కాలంలో తన ప్రసంగాలలో వాడుటకు వీలైన అనుభవములను మనస్సులో భద్రపర్చుకునేవాడు. అందుకుగాను తన మనస్సుకి ఎలాంటి ప్రతిబంధకము లేకుండా చేసుకుంటూండేవాడు సుందర్. తన ప్రభువు

వలెనే సుందర్ కూడా ఉపవాసములతోనే ప్రసంగించాడు.

కాశ్మీర్‌లో ఉన్నప్పుడు తాను విన్న ఒక సంఘటనను ఆధారంగా చేసికొని ఆయన తరచుగా ఒక ఉపమానం చెప్తూ ఉండేవాడు. ఒక యజమానికి ఎన్నో వందల గొర్రెలుండేవి. ఒకానొక దినమున కాపరులు వాటిని ఇంటికి తోలుకొని వచ్చినప్పుడు లెక్కించి చూస్తే కొన్ని కనబడలేదు. పోయిన గొర్రెలను ఎలాగైనా సరే వెదకాలనుకొన్నాడతను. అయితే ఆ గొర్రెలు యజమానుని ఎరుగవు గనుక అవి అతని వెంటరావు. పరాయి వారి దగ్గర నుండి అవి పారిపోతాయి. కాబట్టి ఆ యజమానుడు తనలో తానాలోచించుకొని వేరే గొర్రెలంటే అవి భయపడవనే తీర్మానానికి వచ్చాడు. కాబట్టి ఓ గొర్రె చర్మమును తనపై కప్పుకొని వాటిని వెదకడానికి బయలుదేరాడు. అలా వెళ్ళి వాటి అరుపులు విని వాటి దగ్గరకు పోయాడు. తమ దగ్గరకు మరో గొర్రె వచ్చినదనుకొన్న ఆ గొర్రెలు గొర్రె వేషంలో నున్న యజమానుని వెంబడించాయి. ఆ రీతిగా వాటిని అతడు మందలో చేర్చాడు.

అలాగే దేవుడు కూడా మానవ రూపం ధరించి వచ్చి మన మధ్య జీవించాడు. మానవావతారిగా నున్న క్రీస్తు మనలో ఒకనివలెనైపోవడం వలన ఆయనంటే మనకు బెదురు లేకుండా ఉన్నది గనుక తన మందలోనికి ఆయన మనలను నడిపించగలడు.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)


**ఎపఫ్రా మినిస్ట్రీస్ – హైదరాబాద్‌లో జరిగే ఆరాధన స్థలములు:**

1. భాగ్యలత కాలని, **వనస్థలిపురం**
2. హెచ్.యం.టి., **చింతల్**, జీడిమెట్ల
3. **అనాజ్‌పూర్**, రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర
4. అరుల్ కాలని, ఎ.ఎస్.రావు నగర్, **ఇ.సి.ఐ.ల్**

**వివరములకు: 040-2420 2227**



# జిమ్మి త్యాగము

హమ్మయ్య! సెలవులు ఇచ్చారు, ఎంచక్కా ఆడుకోవచ్చు కదా! పిల్లలూ Enjoy చేయండి కానీ మీ ఆటలతో, విహారయాత్రలతో మీరు, మీ Friends కష్టాలు కొని తెచ్చుకోవద్దు. మీరు ఎక్కడికి వెళ్ళినా మంచి పిల్లలుగా, యేసయ్య ప్రేమను చూపే వారిగా ఉండండి. చెడ్డ స్నేహాలు చేయకండి. దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపును. రాబర్ట్ Holidays లో ఏం చేశాడో చూద్దామా!

“ఏంట్రా హడావుడి? ఎక్కడికి ప్రయాణం? “అన్నాడు రవి. “ఇంకెక్కడికి? సెలవు లలో పిక్నిక్‌కి వెళదామనుకున్నాముగా త్వరగా Ready అయితే వెళ్దాము అన్నాడు రాబర్ట్”.

వారు పిక్నిక్‌కి వెళ్ళాలనుకున్న ప్రదేశం చాలా ఆహ్లాదంగా ఉంటుంది. పెద్ద సరస్సు దాని కిరువైపులా బారులు తీరిన కొండలు, మరో ప్రక్క పచ్చిక బయళ్ళు. దానికి కంచెలా అడవి. అక్కడికెళ్ళాక ఆ ప్రకృతి ఒడిలో అలాగే ఉండి పోదామనిపిస్తుంది. అది ఎంత సుందరమైందో అంత అపాయకరమైందని రాబర్ట్ డాడీ ఎన్నో జాగ్రత్తలు, హెచ్చరికలు చెప్పి పంపించారు.

ఇద్దరూ రాబర్ట్ తల్లిదండ్రుల దగ్గర పర్మిషన్ తీసుకుని, నీట్‌గా రెడీ అయ్యారు. రాబర్ట్ అమ్మ తినుబండారాలు సిద్ధం చేసి పెట్టింది. సైకిలుకు ముందు తగిలించిన బుట్టలో రాబర్ట్ పెంపుడు కుక్క జిమ్మిని కూర్చోపెట్టారు. దాని కళ్ళల్లో కూడా ఉత్సాహం కనిపిస్తూనే ఉంది. పాటలు పాడుకుంటూ, ఈలలు వేసుకుంటూ  సైకిళ్ళ మీద సరస్సు దగ్గరకు చేరారు.

వారిద్దరూ సైకిల్స్ ప్రక్కకు స్టాండ్ వేసి ఆటవస్తువులు తీశారు. రవి తన సంచిలో ఉన్న కేట్‌బాల్ తీసి రాబర్ట్‌కు చూపించాడు. కేట్‌బాల్ వైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు రాబర్ట్, అది కనిపెట్టిన రవి “ఈ కేట్‌బాల్ సంగతి నాకూ తెలీదు మా పక్కింటి అబ్బాయి దగ్గరుంటే ప్రాక్టీస్ చేసి చూద్దామని  తెచ్చాను” అన్నాడు. చాలాసేపు ఆ కేట్‌బాల్‌ను ఉపయోగిస్తూ పిట్టల్ని కొట్టాలని ప్రయత్నం చేశారు. అదెలా వాడాలో తెలుసుకున్నారు గాని, గురి రాలేదు. అందుకే ఒక్క పిట్టను కూడా కొట్టలేకపోయారు. జిమ్మి కూడా నిరాశ పడింది.

మధ్యాహ్నం అయ్యింది భోజనాలు చేసి కూర్చున్నారు. ఆ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. రాబర్ట్, ఇదే మంచి సమయం అని యేసుక్రీస్తు గురించి రవికి చెబుతున్నాడు.

“యేసుక్రీస్తు మంచి వ్యక్తి అని ఒప్పుకుంటాను, కానీ మన పాపముల కొరకు

ఆయన మరణించాడంటే నమ్మశక్యం కావట్లేదు అన్నాడు." "ఎందుకని?" రాబర్ట్ అన్నాడు. "అదెలా ఒకరికోసం మరొకరు ప్రాణం పెట్టడమంటే ఏమిటి? నా కొరకు నువ్వు ప్రాణం పెడతావా? ఒకవేళ అలాగని నువ్వు ప్రాణం వదిలావనుకో, నా మీద ప్రభావమే ముంటుంది?" ప్రశ్నించాడు రవి. ఎలా విశదీకరించాలో రాబర్ట్‌కు తోచక "సరే సరే! పడుకుందాం. నాకు నిద్ర వస్తుంది. అంటూ నిద్రకుపక్రమించారు. జిమ్మి మేలుకొని ఇద్దరికీ కాపలా కాస్తూ ఉంది. సాయంత్రం నాలుగయింది. రాబర్ట్ లేచి, రవిని లేపాడు. ఇంటికి వెళ్ళిపోదాము అన్నాడు. కాసేపు అలా చూసి వద్దాము అన్నాడు రవి. సైకిళ్ళతో ముందుకి సాగిపోతున్నారు. అడవి అంతా చీకటి కమ్ముకుంది. పక్షుల సవ్వడి. "రవీ! చీకటిలో కనిపించడం లేదు ఇంటికి వెళ్ళిపోదాం, నాన్నగారు అడవిలో క్రూర మృగాలు ఉంటాయని చెప్పారు" అన్నాడు. "రాబర్ట్ చైను ఊడింది ఆగు అన్నాడు" రవి. రాబర్ట్ Help చేయడానికి వచ్చాడు. అంతలో ఎటు నుండో అడవి జంతువు అరుపు. ఇద్దరూ ఉలిక్కిపడి చుట్టూ చూస్తుంటే వారికెదురుగానే తోడేలు నోరు తెరుచుకుని గుడ్లురుముతూ నిలబడింది. భయంతో వారిద్దరూ బిక్క చచ్చిపోయారు. దిక్కుతోచక రాబర్ట్ కళ్ళుమూసుకుని ప్రార్థన చేస్తున్నాడు.

మరో నిమిషంలో తోడేలు వారి మీదికి వస్తుందని గ్రహించిన జిమ్మి ఎగిరి తోడేలు మీదకు దూకింది. రెండూ పౌరుషంగా కలియబడ్డాయి. జిమ్మి మెడపట్టుకుని తోడేలు ఈడ్చుకి పోయింది.

రవి,రాబర్ట్ వణుకుతూ నిలబడి జిమ్మిని తలంచుకుంటూ, కంటతడి పెట్టుకుంటూ, ఇంటి ముఖం పట్టారు. రవి ఇంకా జిమ్మిని తలంచుకుంటూ ఏడుస్తూనే ఉన్నాడు. రాబర్ట్ ఆలోచించడం ఆపి, "పాపం జిమ్మి, మన కోసం తన ప్రాణాలర్పించుకుంది. యేసుప్రభువు మన కోసం ప్రాణాలర్పించిన తీరు కూడా అదే అన్నాడు విచారంగా. రవి మనసు చలించింది. "అవును, రాబర్ట్! నాకు బోధపడింది. యేసు ప్రభువు మానవుల కొరకు ప్రాణాలర్పించిన ఉద్దేశ్యమేమిటో గ్రహించాను"

హమ్మయ్యా! రాబర్ట్ మనస్సులో దేవునికి కృతజ్ఞతలు చెల్లించాడు. జిమ్మి ప్రాణత్యాగంతో రవి రక్షణ పొందాడు. తన పాపముల కొరకు ప్రభువు ప్రాణం పెట్టాడని విశ్వసించాడు.

చూశారా పిల్లలూ! Holidaysలో రాబర్ట్ ఒక ఆత్మని రక్షించగలిగాడు. మీరు కూడా ఈ Holidaysలో మీ ప్రవర్తన, మాటలను బట్టి మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకుని ప్రభువుని నమ్మని బంధువులను, స్నేహితులను దేవుని యొద్దకు నడిపిస్తారని ఆశిస్తూ ......

– మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

- బాలకృష్ణ, మచిలీపట్నం, కృష్ణాజిల్లా

బాలకృష్ణ అను నేను కృష్ణాజిల్లా, మచిలీపట్నం దగ్గర సీతారామపురం అనే గ్రామములో జన్మించాను. నాకు ఒక అక్క, చెల్లి. విగ్రహారాధన కుటుంబము. మా చిన్నతనంలోనే చదువు కొరకు మచిలీపట్నం వచ్చాము. మరల కొన్ని సంవత్సరముల తరువాత వ్యాపార నిమిత్తం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు లోని మా అమ్మమ్మ వాళ్ళ దగ్గరకు వచ్చాము. అక్కడ నేను 10వ తరగతి చదువుతూ రోజూ 2 సినిమాలు తప్పకుండా చూచేవాడిని. అందువలన 10వ తరగతి ఫెయిల్ అయ్యాను. ఇంక చదువు మీద ఆసక్తి లేకపోవడంతో లారీ క్లీనర్‌గా పనికి వెళ్ళేవాడిని. చెడు వ్యసనములకు అలవాటు పడుతున్న సమయంలో నా తల్లిదండ్రులు గమనించి 20 సం॥ల వయస్సులోనే మా మేనత్త కూతురుని ఇచ్చి వివాహం జరిగించారు. మా అత్తయ్య, మామయ్య వాళ్ళు ప్రార్థన చేసుకునే వారు. వారితో పాటు నా భార్య కూడా ప్రార్థన చేసుకునేది. వివాహం అయిన 2 నెలలకే 2002వ సంవత్సరంలో హైదరాబాద్ వచ్చాము. ఇక్కడ మా చిన్న నానమ్మ వాళ్ళు ఉండేవారు. ఆ తాతగారు 2000/- జీతమునకు ఒక కంపెనీలో పెట్టారు. నేను ప్రార్థన అంటే ఇష్టపడే వాడిని కాను. నా భార్యని ఇంట్లో పూజలు, పండుగలు చేయమని అంటూ ఉండేవాడిని. నాతో పాటు గుళ్ళకి కూడా తీసుకువెళ్ళేవాడిని. తను మాత్రం పూజలు చేయడానికి ఇష్టపడేది కాదు. మాకు పాప పుట్టింది. ఒకరోజు నా భార్య చర్చికి వెళ్ళింది. నాకు ఇష్టం ఉండదని తెలిసి నువ్వు ఎందుకు వెళ్ళావు అని బాగా తిట్టాను. తరువాత నాకు బాగా జ్వరం వచ్చింది. ఎన్ని రోజులైననూ తగ్గలేదు, మలేరియా అని డాక్టర్లు చెప్పారు. అప్పుడు నా భార్య ప్రార్థన చేసేది, నన్ను కూడా చేసుకోమనేది కాని నేను చేసేవాడిని కాదు. ఇంట్లో విగ్రహాలు ఉండేవి, పూజలు చేయనప్పుడు, వాటిని తీసివేయమని చాలాసార్లు చెప్పడం వలన ఆమె మాట విని వాటిని తీసివేసి, నేను కూడా ప్రార్థన చేసుకోవడం మొదలు పెట్టాను.

ఇద్దరం ఇంట్లోనే ప్రార్థన చేసుకునే వారము. కొద్దిరోజుల తరువాత చింతల్‌లోని ఎపఫ్రా మినిస్ట్రీస్ మందిరము ముందు ఉన్న ఇంట్లోకి మా మామయ్య వాళ్ళు అద్దెకి రావడం జరిగింది. వాళ్ళు మందిరమునకు వెళ్ళి వచ్చి బ్రదర్. ఎపఫ్రాగారిది చిన్న వయస్సు అయినా, వాక్యము బాగా చెప్పుచున్నారు అని నాకు బ్రదర్ గురించి చెప్పుచూ ఉండేవారు. అది విని నేను, నా భార్య కూడా మందిరమునకు వెళ్ళినప్పుడు ఎపఫ్రా అన్నయ్య చెప్పిన వాక్యము నెమ్మదిగా, సంతోషంగా అనిపించింది. ఈ విధంగా కొన్ని దినములు జరిగిన తరువాత ఒక ఆదివారపు ఆరాధనలో బాప్తిస్మం గురించి చెప్పారు. అదే రోజు బాప్తిస్మం తీసుకున్న వారు

వరుసలలో కూర్చుని, లేనివారు బయట ఉండండి అని చెప్పినప్పుడు నాకు ఒక రకమైన ఫీలింగ్ ఏర్పడి, నేను ఎందుకు అక్కడ లేను అని బాధపడి కొద్ది దినముల తరువాత 2005 డిసెంబర్ 31 బాప్తిస్మం తీసుకున్నాను. అప్పటి నుండి హృదయంలో సంతోషం, సమాధానమును అనుగ్రహించడమే కాకుండా ఆర్థిక విషయములలో కూడా 2000/- జీతం నుండి 5 అంకెల జీతం వచ్చునట్లుగా దేవుడు సహాయం చేశారు. మా చెల్లికి క్రైస్తవ వివాహం జరగాలని, దేవుని ఎరిగిన వ్యక్తి అయితే దేవునిలో జీవిస్తారని తలంచి, ప్రార్థించుకున్నప్పుడు ఆ విధంగానే దేవుడు క్రైస్తవ వివాహం జరుగునట్లు కృప చూపారు. అంతేకాక వారి కుటుంబము ఎపఫ్రా మినిస్ట్రీస్‌లోనే దేవునిలో జీవించునట్లుగా సహాయం చేశారు. నా భార్యకు రెండవ డెలివరీలో కామెర్లు వచ్చి రక్తం అవసరమై చాలా ఇబ్బంది కలిగింది. బ్రదర్‌కి చెప్పి ప్రార్థన చేయించుకోవడం ద్వారా ఎటువంటి కీడు కలగకుండా దేవుడు బాబుని అనుగ్రహించారు. మా అమ్మ కూడా దేవునిని ఎరిగి ఆయన మార్గములో నడుస్తుంది. నా తండ్రి కూడా ఇప్పుడిప్పుడే ఆయన మార్గములో నడవడానికి ఇష్టపడుతున్నాడు. మా కుటుంబము మొత్తం దేవుని సన్నిధిలో ఉండాలని ప్రార్థన చేయగలరు.



# రూపాయి, యూరో, పౌండ్, డాలర్



ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును, హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా **ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము** (1 తిమోతి 6:9,10)

బైబిలు గ్రంథములో ధనము అనే విషయమును గురించి అనేక సంగతులు వ్రాయబడి ఉన్నవి. క్రైస్తవులు ప్రార్థించుట, బైబిలు చదువుట, మందిరమునకు వెళ్ళుట మాత్రమే ప్రాముఖ్యమైనవిగా భావించుట జరుగుతుంది. కానీ ధనం విషయములో తగు జాగ్రత్త తీసుకొనకపోతే అది ఎంతో నష్టము అని గ్రహించవలెను. ప్రార్థనాంశములను గూర్చిన విషయములు 500 సార్లు, విశ్వాసమును గూర్చిన వచనములు 500 సార్లు ఉంటే, ధనమును గూర్చిన వచనములు 2,350 సార్లు బైబిల్ గ్రంథములో వ్రాయబడి ఉన్నాయి. ధనము ఎప్పటికి మన అవసరతలు తీర్చబడుటకు మాత్రమే కానీ అది ఒక ఆరాధించే వస్తువు కాకూడదు. కొందరు తమ డబ్బుని అవసరములకు కూడా వినియోగించక, పిసినితనముతో ఉండుట గమనించెదము.

**ధనాపేక్ష వలన కలిగే శోధన –** ధనాపేక్ష వలన మనుష్యుడు పొరుగువారిది ఆశించి, తోటి వారిని మోసగించుట, అబద్ధములు చెప్పుట, అన్యాయముగా ప్రవర్తించుట, స్నేహితులను, కుటుంబస్థులను వంచించుట జరుగును. తద్వారా తన కొరకు దేవుడు సిద్ధపరిచిన ప్రేమ, ఆప్యాయతలు కలిగిన వ్యక్తులను కూడా దూరం చేసుకునే దుర్భరమైన పరిస్థితులు కలుగుతాయి.

యేసుక్రీస్తు శిష్యుడైన యూదాని చూడండి. 31/2 సంవత్సరములు ఆయనతో ఉండి, ఆయన మంచితనమును, త్యాగమును, స్నేహభావమును దగ్గర నుండి చూచినప్పటికి, తనని ఎంతగానో ప్రేమించి ఏ తల్లి, తండ్రి యజమాని పంచని ఆప్యాయతని పంచిన వ్యక్తిని 30 వెండి నాణెములకు శత్రువులకు అప్పగిస్తాను అని బేరం కుదుర్చుకొని వచ్చి, చివరకు ఆ ద్రవ్యము తీసుకొని, క్రీస్తుని అప్పగించడం జరిగింది. ఇంత హీనమైన పని చేయడానికి అతని జీవితమును పురికొల్పింది ధనాపేక్షే. అంతేకాక చివరికి ఆ ఇస్కరియోతు యూదాని మనశ్శాంతి లేకుండా చేసి, ఆత్మహత్య చేసుకునే వరకు విడిచిపెట్టలేదు. ధనాపేక్ష యొక్క ఫలితములు ఎంత ఘోరమైనవో చూశారా! ధనము జీవితమునకు అవసరమే కానీ, ధనమును గూర్చిన అపేక్ష మనిషికి అక్కర్లేదు. అవసరమునకు, అపేక్షకి మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. ధనము అవసరమునకు కావాలి కానీ, ధనాపేక్ష మాత్రం ఉండకూడదు.

# ఇది మీకు తెలుసా?

1. దేవుడు యేసు ప్రభువుని ప్రేమించినట్లే మనలను కూడా ప్రేమిస్తున్నాడు.

   "నీవు నన్ను ప్రేమించినట్లే వారిని కూడా ప్రేమించితివి" – (యోహాను 17:23)

2. దేవుడు నిజాయితీ కలవారి యందు ఆనందించును.

   "ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము" – (1 యోహాను 1:7)

3. ఉత్సాహముగా ఇచ్చు వారి యందు దేవుడు సంతోషించును.

   "దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" – (2 కొరింథి 9:7)

4. యేసు ప్రభువు వైపు చూచుట వలన పరిశుద్ధత వచ్చును.

   "యేసు వైపు చూచుచు....మన ఎదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము" – (హెబ్రీ 12:1,2)

5. మనము పరిశుద్ధాత్మ నింపుదలతో కొనసాగుతూ ఉండవలెను.

   "ఆత్మ పూర్ణులై యుండుడి" – (ఎఫెసీ 5:18)

6. సిలువ మార్గమే జీవ మార్గము.

   "మనమాయనతో కూడ చనిపోయిన వారమైతే ఆయనతో కూడ బ్రదుకుదుము" – (2 తిమోతి 2:11)

7. ఈ లోకమంతా ఘనముగా ఎంచుదానిని దేవుడు అసహ్యించుకొనును.

   "మనుష్యులలో ఘనముగా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యము" – (లూకా 16:15)

# అయ్యో ప్రేమ

**- ఎడిటర్**

ఒకానొక సమయములో భావములు మరియు ఉద్రేకములు కలిసి విహారయాత్రగా సముద్రము మధ్యలో ఉన్న ఒక ద్వీపమునకు వెళ్ళాయి. వాటికి అది ఎంతో సంతోషకరమైన సమయముగా ఉంది. అకస్మాత్తుగా తుఫాను రాబోతుంది కనుక అందరు దీవిని విడిచి వెళ్ళిపొండి అని ఒక ప్రకటన వెలపవడడంతో అంతా గందరగోళంగా మారింది. అందరూ తమ తమ బోట్స్‌ని సిద్ధం చేసుకున్నారు. అయితే ప్రేమ, నేను చేయవలసింది చాలా ఉంది అనుకుంటూ, ఏ మాత్రం త్వరగా తప్పించుకొని పోవడానికి ఇష్టపడలేదు. కొంత సమయమునకు అందరూ వెళ్ళిపోవడానికి సిద్ధమవుతూ ఉన్నారు. వాతావరణం త్వరగా మార్పు చెందుతుంది. ప్రేమ వెళ్ళడానికి బోట్ లేదు. అప్పుడు ప్రేమ నిరీక్షణతో చుట్టూ చూసింది.

అప్పుడు విజయం తన బోటులో వెళ్ళిపోతుండగా

**ప్రేమ** :- "నన్ను కూడా నీ బోట్‌లో తీసుకువెళ్ళు" అని గట్టిగా అరిచింది.

**విజయం** :- "నా బోటు విలువైన వస్తువులతో, బంగారము మరియు వెండితో నిండిపోయింది. ఇంక స్థలం లేదు"

కొద్ది సమయం తరువాత ఒక అందమైన బోటులో గర్వం వెళ్ళుచుండగా

**ప్రేమ** :- "నాకు బోట్ లేదు, దయచేసి నీతో తీసుకువెళ్ళు"

**గర్వం** :- "హేళనగా చూస్తూ, ఇంత అందమైన బోట్‌లో నీ లాంటిది ఎక్కకూడదు నేను తీసుకువెళ్ళను"

కాసేపటికి చింత ప్రయాణమై వెళ్ళుచుండగా

**ప్రేమ** :- "నాకు సహాయం చెయ్యవా !"

**చింత** :- "నేను చాలా బాధలో ఉన్నాను, దయచేసి నన్ను ఒక్కదానినే వదిలెయ్" అంటూ వెళ్ళిపోయింది

సంతోషం వెళ్ళిపోతూ ఉండగా

**ప్రేమ** :- నన్ను తీసుకువెళ్ళమని పిలిచింది.

కానీ సంతోషం చాలా ఆనందముతో ఈ మాటలు పట్టించుకోక, చుట్టూ ఉన్న పరిస్థితిని గమనించకుండా వెళ్ళిపోతూ ఉంది.

అప్పుడు ప్రేమ అవిశ్రాంతితో, నిరుత్సాహముతో ఉండగా ఎవరో ప్రేమా ! రా ! నాతో నిన్ను తీసుకువెళ్తాను అని పిలిచారు. ఇంత ఔదార్యము కలిగిన వారు ఎవరో ప్రేమకి అర్థం కాలేదు. వెంటనే ఆ బోటులోనికి దూకింది. ఆ అపాయము నుండి తప్పించబడి, క్షేమంగా గమ్యమునకు చేరింది.

ప్రేమ బోటు దిగిన తరువాత జ్ఞానముని కలుసుకుంది

నాకు ఎవ్వరూ సహాయం చేయడానికి ముందుకి రానప్పుడు నా యెడల దయ చూపించి, నాకు సహాయం చేసిన వారెవరో చెప్పగలవా? అని జ్ఞానముని అడిగింది.

జ్ఞానము ఒక నవ్వు నవ్వి  ఓహ్! అదా సమయము నిన్ను కాపాడిందిలే అని చెప్పింది. సమయము ఆగి తనని ఎందుకు రక్షించిందా ? అని ప్రేమ ఆశ్చర్యపోయింది.

జ్ఞానము నవ్వుతూ లోతైన విశ్లేషణతో ఇలా చెప్పింది.

నీ విలువ మరియు గొప్పతనము సమయమునకు మాత్రమే తెలుసు. ఈ ప్రపంచములో శాంతిని, గొప్ప సంతోషమును కేవలం ప్రేమ మాత్రమే ఇవ్వగలదు.

వీటన్నిటి ద్వారా మనం పొందవలసిన ప్రాముఖ్యమైన సందేశం ఏదనగా జయముతో ఉన్నప్పుడు ప్రేమని గురించి పట్టించుకోము. అహంభావముతో వెళ్తున్నప్పుడు ప్రేమని మర్చిపోతాము. సంతోష మరియు దుఃఖసమయములలో సైతము ప్రేమ మనకి జ్ఞాపకం రాదు. కేవలం కొన్ని సమయములలో మాత్రమే ప్రేమ యొక్క ప్రాముఖ్యతని గ్రహించగలుగుతాము. కాబట్టి ఎన్నడూ మన జీవిత గమనములో ప్రేమను కలిగి ఉండడాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు, ప్రసంగముల సి.డి.లు కావలసినవారు ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు.**

మా చిరునామా: **ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# తాబోరు కొండ



తాబోరు అనగా రాతి గని లేక ఎత్తయిన స్థలము అని అర్థము.

నజరేతునకు తూర్పువైపున 7 మైళ్ళ దూరములో గలిలయ సరస్సు సమీపంలోని మైదాన ప్రాంతములో నిటారుగా లేచిన కొండ.దీని శిఖరం సముద్ర మట్టమునకు 600 మీటర్ల ఎత్తున ఉంది. 1843 అడుగుల ఎత్తు మాత్రము ఉండినను బోడియై గుండ్రముగా ఉండుటచే చాలా దూరము వరకు అన్ని దిక్కులకు కనబడుచుండును. అందువలన ఇది హెర్మోను పర్వతము కంటె చాల చిన్నదిగా ఉన్నను హెర్మోనుతో కూడా లెక్కింపబడి, ఉన్నతమైన పర్వతములలో ఒకటిగా ఎంచబడెను. అది జెబూలూను గోత్రములో ఉన్న ఒక ఊరుగా రామా నుండి గిబియాకు పోవు మార్గమున ఉండు ఒక మైదానముగా చెప్పబడును. జెబూలూను, ఇశ్శాఖారు గోత్రముల సరిహద్దుగా ఉండెను. ఇది ఒక పూజాస్థానమై యుండెనని నమ్ముతారు. దెబోరా బారాకులు యుద్ధమునకు వెళ్ళినప్పుడు తమ సేనలను ఈ కొండ దగ్గరే సమకూర్చిరి. లౌకిక చరిత్రను చూసినప్పుడు తాబోరు ఒక గొప్ప దుర్గముగా ఉండెను.

ప్రస్తుతము తాబోరు కొండ మీద మంచి వనములు కలవు. క్రైస్తవ సన్యాసుల మఠములు కూడా కొన్ని ఉన్నాయి. ఇవి కాక ఒక గొప్ప కోట యొక్క ప్రాకారములును, మిక్కిలి పురాతనమైన గుళ్ళ యొక్క శేషములును అనేక సమాధులును అచ్చట కనబడును. ప్రస్తుతము దానికి జెబెల్ ఎట్‌టూరు అని పేరు అనగా కొండల కొండ అని అర్థము.




# బైబిల్ క్విజ్ -16

(రోమా పత్రికలో నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

1. ఉచితముగా దేని ద్వారా నీతిమంతులముగా తీర్చబడుతున్నాము?
2. అయ్యో నేనెంత దౌర్భాగ్యుడను? అన్నది ఎవరు?
3. ఎవరికి కృప చూపుటకు ఐశ్వర్యవంతుడై యున్నాడు ?
4. బ్రదికినను ప్రభువు కోసమే బ్రదుకుచున్నాము చనిపోయినను ప్రభువు కోసమే చనిపోవుచున్నాము కాబట్టి మనము ఎవరము?
5. సువార్త ప్రకటించువారి పాదములు ఎలాంటివి ?
6. శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమలయందు ఏమి చేయాలి?
7. మన బలహీనతను చూచి సహాయము చేయువారు ఎవరు ?
8. మనలను ప్రేమించిన వాని ద్వారా శోధనలలో ఏమి పొందుచున్నాము?
9. నా శరీరమందు మంచిది ఏదియు లేదని ఎవరు చెప్పుచున్నారు?
10. వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి. రిఫరెన్సు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జూన్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జూలై 2011 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా – ఎడిటర్ – స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 500 070

**బైబిల్ క్విజ్ – 15 జవాబులు** (అపోస్తలుల కార్యములో నుండి ఇవ్వబడినవి)

1. అగ్రిప్పరాజు పౌలుతో అనెను, 26:28
2. పౌలు, బర్నబా, 14:22,21,20
3. పౌలు చేత, 19:11
4. దమస్కులో, 9:19,20
5. పౌలు, బర్నబా (దేవతలు), 14:12
6. 40 దినముల వరకు, 1:3
7. ఇస్కరియోతు యూదా, 1:20
8. అపొల్లో, 18:24
9. ఆదివారము, అర్ధరాత్రి, 20:7,11
10. ఏడుగురు, 6:3

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మే - జూన్

**భాగ్యలత :** మణి, శిరీష, మేరీరత్నం, జ్యోతి, వెంకటేష్, మల్లిక, హారిక, రోషిణి, శారా, మాధురి, సుధ, రూతు, శేఖర్‌బాబు, రఫీ, మేరీఫాతిమా, జాన్, పాల్‌రాజ్, వీరలింగం, నవ్య, జయరాజు, ఫిలిప్పు, మన్యం, లక్ష్మీ, నవీన, రూతు, విజయ, జ్యోతి, లత, నాగరాజు, కృష్ణకళ్యాణ్, ప్రియాంక, వినయ్‌కుమార్, నాగరాజు, నవీన్, అనిల్‌కుమార్, మధుబాల, ప్రశంస, ప్రశాంతి, గీతాసాత్విక, ఆనందప్రసాద్, మణికాంత్‌రెడ్డి, కృపాజ్యోతి, శారమ్మ, మమత,శేఖర్ (సింగపూర్).

**చింతల్ :** విజయ, సాత్విక్, శామ్సన్, సాల్మన్‌రాజు, జీవా, రమ్య, శ్రీనివాసరావు, జగన్‌మోహన్‌రావు, అనూష, లత, గోపిచంద్, ఐజాక్‌కుమారి, వెన్నెల, నిహారిక, రవీందర్, జాన్సన్, సురేష్‌బాబు, స్వర్ణలత, మల్లేశ్వరి, సంధ్యారాణి, ప్రజ్ఞ, సునీత, ఆనంద్‌కుమార్, బాబూరావు,అభిషేక్,మరియ,బెంజిమన్, రాధాకృష్ణ, దేవకిరణ్, విజయమ్మ, సురేంద్ర, ఎలిజబెత్ రాణి, వివేకవతి, నిర్మల, ప్రశస్త, ఎస్తేరురాణి, రూతమ్మ, జీవమణి, జగన్, విజయ్, కృపారాణి.

**అనాజ్‌పూర్ :** జీవన్‌కుమార్, మృణాళిని, మహాలక్ష్మి, ఆంద్రెయ, జాషువా, నరసింహా, రాజ్‌కుమార్, రత్నాకర్, కారుణ్య, సుజిత్‌కుమార్, బ్లెస్సీ, మరియమ్మ

**ఇ.సి.ఐ.యల్ :** విజయ్‌కుమార్, ఆనంద్, వివేక్.

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,

భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

# హెన్రీ మార్టిన్

లోకములో మూడు రకములైన గొప్ప వ్యక్తులున్నారని ఒక భక్తుడు చెప్పాడు. మొదటివారు లోకమును వారి గొప్ప కార్యములతో నింపుతారు. మనుష్యుల చేత కొనియాడబడతారు. రెండవ రకము వారు తెలివైన వారుగా ఉండి ఉన్నత పదవులను సంపాదించుకుంటారు, ప్రసిద్ధి కెక్కుతారు. మూడవ రకము వారు త్యాగము చేయుటలోను, జాలి, ప్రేమ కలిగియుండడంలోను చాలా శ్రేష్ఠులైయుంటారు. దేవుడు వీరి విషయమై తృప్తి చెందుతాడు. ఈ కోవకు చెందిన వాడే "హెన్రీ మార్టిన్"

క్రీ.శ 1781 ఫిబ్రవరి 18వ తేదీన కార్న్‌వాల్ లోని ట్రురో అను గ్రామములో గనిలో పని చేయుచుండిన ఇంగ్లాండు దేశస్థుడైన జాన్ మార్టిన్‌కు మూడవ సంతానముగా హెన్రీ మార్టిన్ జన్మించెను. హెన్రీ 2 సం॥ల వయస్సులోనే తల్లిని పోగొట్టుకొన్నాడు.

మార్టిన్ యౌవనకాలములో ఒక భయంకరమైన పోరాటము ఉండినది. తన మార్పు విషయము లోకము మీద అతనికి ఉన్న ఆకర్షణ విషయము అంతరంగములో పోరాటము జరిగింది. కానీ లోకం మీద ఆకర్షణయే అతనిని జయించినది. కొన్ని నెలలకు మార్టిన్ తండ్రి చనిపోయెను. తండ్రి మీద ఉన్న ప్రేమను బట్టి ఆ దుఃఖములో అతడు పరిశుద్ధ గ్రంథమును చదువనారంభించెను. డేవిడ్ బ్రైనార్డ్, మరియు విలియం కేరీ యొక్క జీవిత చరిత్రలు హెన్రీలో ఉజ్జీవమును కలిగించాయి.

**2011, ఏప్రిల్ నెలలో జరిగిన గుడ్‌ఫ్రైడే మరియు ఈస్టర్ ఆరాధనలలో అనేకులు ప్రార్థనలలో పాల్గొని దేవుని దీవెనలు పొందటం జరిగినది.**








# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com
web: www.epaphra.org